క్లుప్తంగా

గురుచరిత్ర పారాయణ



గురుచరిత్ర పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: ప్రపంచ శాంతి, ప్రజాసంక్షేమాన్ని కోరుతూ స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో 11 వారాలు నిర్వహించ తలపెట్టిన గురుచరిత్ర పారాయణ మూడో వారానికి చేరుకుంది. వేకువజామునే 5.15 గంటలకు కాకడ హారతి ఇచ్చిన అనంతరం స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో గురుచరిత్ర పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్విరామంగా కొనసాగించారు. ఎనిమిదిన్నర గంటల పాటు ఏకధాటిగా జరిగిన ఈ పారాయణలో పలువురు భక్తులు పాల్గొని, తలో కొన్ని అధ్యాయాలను పఠించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలోనూ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

పెదపూడి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ, విద్యాశాఖ, రెవెన్యూ, ఇరిగేషన్, ఐసీడీఎస్, డ్రైయినేజీ, పంచాయతీరాజ్ తదితర శాఖలవారీగా అధికారులు ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీడీఓ ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ కొరెడ్ల వెంకన్నబాబు, ద్వారంపూడి పద్మారెడ్డి, నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

256 మందికి వైద్యసేవలు



పురుషోత్తపట్నంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 256 మందికి సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. అవసరమైన పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఇళ్లలో మంచంపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వారి వైద్యం చేశారు. ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నం, ఏఎన్ఎం పద్మ, ఆశావర్కర్లు పి.లక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రంగంపేట: మండలంలోని వడిశలేరు విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ హెడ్ క్వార్టర్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వడిశలేరు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

సీతానగరం: మండలంలోని 11 కేవీ మిర్తిపాడు ఏజీఎల్, సీతానగరం రూరల్ ఫీడర్ లైన్ మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఆ సమయంలో ములకల్లంక, బొబ్బిల్లంక, వంగలపూడి, సింగవరం, పెదకొండేపూడి, చీపురుపల్లి, అచ్యుతాపాలెం గ్రామాలకు, అలాగే ఉప కేంద్రం పరిధిలోని వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మహిళలకు బంగారు రూపుల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కంబాల శ్రీనివాసరావు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో గురువారం నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక – 2 లక్కీ డ్రాలో 50 మంది మహిళలు విజేతలుగా నిలిచారు. వారందరికీ ఒక గ్రాము బంగారు రూపులను అందజేశారు. ఈ కార్యక్రమం నిర్వాహకుడు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల్లో హిందూ ఆచార సంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావం పెంచడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరంగపట్నం సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, పెద్దలు దాసరి తమ్మన్నదొర పాల్గొన్నారు.

పుస్తకాలు రావు.. చదువు సాగదు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందని పుస్తకాలు
- పాత పుస్తకాలతోనే బోధించాలంటూ ఆదేశాలు
- ప్రైవేటు స్కూళ్ల వైపు మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న టీచర్

బిక్కవోలు: బాల్య దశ నుంచే చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగానే అంగన్‌వాడీలకు వచ్చే బుజ్జాయిలకు ఆసక్తి కలిగించేందుకు ఆటపాటలతో కూడిన బొమ్మలున్న పుస్తకాలను అందజేసింది. చిన్నారులకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన కిట్లను అందజేసింది. ఫలితంగా చిన్నారులు సైతం అంగన్‌వాడీలకు వచ్చేందుకు ఆసక్తి చూపించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బుజ్జాయిలకు పుస్తకాలను ఇవ్వలేదు. పాత పుస్తకాలతోనే కాలం గడిపేయమని అనధికార ఆదేశాలివ్వడంతో అంగన్‌వాడీ సిబ్బంది సైతం చేసేది లేక అదే పాటిస్తున్నారు.

మళ్లీ మొక్కుబడి తంతు


2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే 3 నుంచి 6 ఏళ్ల లోపు బాలలకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–1 కిట్లు, పీపీ–2 కిట్లు అందించేవారు. ఆయా పుస్తకాలను ఏటా జూన్‌లోనే అంగన్‌వాడీ కేంద్రాలకు చేరవేసి చిన్నారులకు అందజేసేవారు. దీనివల్ల అంగన్‌వాడీ టీచర్లు బొమ్మలతో కూడిన పుస్తకాలను చూపిస్తూ చిన్నారులకు విద్యను బోధించడం సైతం సులువయ్యేది. మరోవైపు చిన్నారులు సైతం ఆసక్తిగా పాఠాలు నేర్చుకునేవారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైవేటు స్కూల్ తరహాలో ఆంగ్ల బోధన అందిస్తుండడంతో తల్లిదండ్రులు తమ

కొత్త పుస్తకాలు రాలేదు

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త పుస్తకాలు ఇంకా రాలేదు. ప్రస్తుతం పాత పుస్తకాల తోనే చిన్నారులకు బోధి స్తున్నాం. పాత పుస్తకాల్లో కొంత మేర సిలబస్ మార్చే అవకాశముంది. పుస్తకాలు వచ్చిన వెంటనే అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తాం.

– జెస్సీ ఫ్లోరెన్స్, ఐసీడీఎస్ సీడీపీఓ, రంగంపేట ప్రాజెక్ట్

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	3 నుంచి 6 ఏళ్ల చిన్నారులు
అనపర్తి	66	597 మంది
బిక్కవోలు	70	870 మంది
రంగంపేట	48	652 మంది
పెదపూడి	81	741 మంది
మొత్తం	265	2,860 మంది



పీపీ-1 పుస్తకం



పీపీ-2 పుస్తకం

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు ఆసక్తి చూపించేవారు. అయితే గత జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సదరు పుస్తకాల పంపిణీ అటకెక్కింది. పాత పుస్తకాలతోనే సరిపెట్టుకోమనడంతో అంగన్‌వాడీల్లో విద్యాబోధన మొక్కుబడి తంతుగా మారిపోయింది. కొత్తగా పుస్తకాలు ఇస్తారో ఇవ్వరోనన్న సందేహాలు తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రైవేటు స్కూళ్లకు పంపించడానికే మొగ్గు చూపిస్తున్నారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి



రంగంపేటలో తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రంగంపేట: తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఇమిడి ఉంటుందని, పుట్టిన బిడ్డకు తల్లిపాలను పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి బిడ్డ ఆరోగ్యంగా జీవిస్తుందని డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల విశిష్టను వివరిస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంట లోపు ముర్రుపాలు తప్పనిసరిగా అందించాలన్నారు. ఈ పాలలో విటమిన్ ఏ అధికంగా ఉండటం వల్ల కంటి చూపు బాగుంటుందన్నారు. కామెర్లు వంటి వ్యాధులు దరిచేరవని చెప్పారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకూ ఇతర ద్రవాలు ఇవ్వకుండా కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సంకీర్తన మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, అది చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.చిన్నారావు, సీహెచ్‌ఓ కె.జయమణి, సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

బిందు సేద్యంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మైక్రో ఇరిగేషన్ అధికారి దుర్గేష్

రాజానగరం: బోర్లు ఉన్న రైతులందరూ బిందు, తుంపర సేద్యంపై అవగాహన పెంచుకోవాలని, ఈ విధానంలో సాగుఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏపీ మైక్రో ఇరిగేషన్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.దుర్గేష్ అన్నారు. రాజానగరం, రంగంపేట, బిక్కవోలు మండలాలకు చెందిన ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు (ఏపీఎంఐపీలు) గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాలులో బిందు, తుంపర సేద్యం రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. దుర్గేష్ మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింకర్లను రాయితీపై పొంది ఏడేళ్లు దాటితే మరోసారి డ్రిప్ తీసుకోవచ్చన్నారు. ఈ పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తుందన్నారు. ఈ–క్రాప్ యాప్‌లో అన్ని పంటలను నమోదు చేసి, వచ్చే నెల 15 నాటికి రైతుల ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇదే సమయంలో ఉద్యాన పంట విస్తరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, పతంజలి ఫుడ్స్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. వీధులు జలమయం



సీతానగరం శెట్టిబలిజపేటలోని ఈత రామారావు వీధిలో ముంపు నీరు



సీతానగరం బస్టాండ్ సెంటర్ సమీపంలో రోడ్డుపై నీరు

సీతానగరం: భారీవర్షంతో వీధులన్నీ జలమయమయ్యాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు మునిగిపోయాయి. సీతానగరంలోని శెట్టిబలిజపేట ముంపు బారిన పడింది. సీతానగరంలో 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సీతానగరం లంకూరు వద్ద ఉన్న గొయ్యి నిండిపోవడంతో నీరంతా ప్రధాన డ్రైనేజీ ద్వారా ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద గల గొయ్యిలోకి చేరుకుంది. అక్కడి కుమ్మరి గొయ్యి నిండి ముందుకు వెళ్లడానికి అమర్చిన తూరలు మూసుకుపోవడంతో వెనక్కి ఎగపోటుతో శెట్టిబలిజపేట, ఈత రామారావు వీధి, బస్టాండ్ సెంటర్ సమీపంలో తురాయి చెట్ల వద్ద సిమెంట్ రోడ్డుపైకి నీరు చేరుకుంది. దీనితో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శెట్టిబలిజపేటలోకి నీరు చేరుకోవడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి స్థానికులు అవస్థలు పడ్డారు. స్థానికులు పొక్లెయిన్ సాయంతో బస్ స్టేషన్ వద్ద సిమెంట్ రోడ్డు కింద ఉన్న తూరల్లోని మట్టిని తొలగించారు. రఘుదేవపురం పరిధిలో నీరు లోతట్టు ప్రాంతాలకు ప్రవహించేలా బోదెను తవ్వారు.

ఆగని రాజకీయ కక్షలు



బిక్కవోలులో కూల్చేసిన దుకాణాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

బిక్కవోలు: అనపర్తి నియోజకవర్గంలో రాజకీయ కక్షలు ఆగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిక్కవోలు మండలం పందలపాకలో పేదలకు చెందిన వ్యాపార దుకాణాలు కూల్చేసిన ఘటన మరవకముందే గురువారం బిక్కవోలులో మరో రెండు దుకాణాలను నేలమట్టం చేశారు. బిక్కవోలుకు చెందిన సీడం ప్రకాష్, గరగా వెంకటరాజులకు చెందిన రెండు దుకాణాలను గురువారం కూల్చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సానుభూతి పరులన్న కారణంగా వారిపై ఎన్డీఏ నాయకులు రాజకీయ కక్ష తీర్చుకున్నారన్నారు. ప్రశాంతంగా ఉండే అనపర్తి నియోజకవర్గంలో దుష్ట సంస్కృతికి స్థానిక ఎన్డీఏ నాయకత్వం బీజం వేసిందన్నారు. రాజకీయాల్లో ఎప్పుడూ వాళ్లే శాశ్వతం కాదని అధికారం మారిన తర్వాత తమ పరిస్థితి ఏంటో కూడా వారు ఆలోచించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపు మాత్రమేనన్నారు. సీడం ప్రకాష్‌కు చెందిన షాపు సుమారు వందేళ్లకు పూర్వం నుంచి ఉందని, గరగా వెంకటరాజుకు చెందిన షాపు సుమారు 20 ఏళ్ల క్రితమే ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ షాపులకు పంచాయతీ విధించిన పన్ను చెల్లించడంతో పాటు విద్యుత్ సర్వీస్ ఉందన్నారు. వైఎస్సార్ సీపీలో చురుకుగా ఉంటున్నారని కక్షతో ఇలా చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉపసర్పంచ్ డాక్టర్ మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవరచుకోవాలి



రామవరంలో ట్రస్ట్ ప్రతినిధులు పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

పెదపూడి: విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీతత్వం అలవరచుకోవాలని అర్తమూరుకి చెందిన ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎస్ స్టడీ మెటీరియల్, పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ యంత్రం గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.గంగాభవానీ, మాజీ సర్పంచ్ టీ.శ్రీనివాసు, ట్రస్ట్ కన్వీనర్ కోనాల సత్తిరెడ్డి, గ్రామ పెద్దలు ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎస్.గోపాలకృష్ణారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సబ్బెళ్ల హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత



ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

రంగంపేట: మహిళల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యతని ఐసీడీఎస్ సీడీపీఓ జె.జెస్సీఫ్లోరెన్స్ పేర్కొన్నారు. మనుషుల అక్రమ రవాణాపై ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందన్నారు. రోజూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీనికి గురవుతున్నారన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ టి.శ్రావ్యశ్రుతి మాట్లాడుతూ అక్రమ రవాణాను అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలని, ప్రతి గ్రామంలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూప్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు శివ, అంబర్‌సింగ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీతానగరం పీహెచ్‌సీ పరిశీలన



సీతానగరం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు

సీతానగరం: నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.సంధ్యారాణి, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ జి.వసంత లక్ష్మి, డీసీఎం ఎం.అర్జునరావు (జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్) గురువారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీతో పాటు క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు, అంగన్‌వాడీ పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కొందరు గర్భిణులు, బాలింతలు, పిల్లలతో మాట్లాడి, సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, ఎంపీహెచ్‌వో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ జి.దైవకృప పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

బిక్కవోలు: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ సత్తి వీరమణి అన్నారు. గురువారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరమణి మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని చెప్పారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొంకుదురు పీవీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భోజనం వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం నిరుపేదలకు దాతల సహకారంతో భోజనం ప్యాకెట్లు అందించారు. సీతానగరానికి చెందిన దేగల సూర్యకాంతం జ్ఞాపకార్థం, ఆమె కుమారుడు రాంబాబు ఆధ్వర్యంలో 150 మందికి పంపిణీ చేశారు.

పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు



గుమ్ములూరు హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ గొల్లపల్లి అప్పారావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: మండలంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు గురువారం జరిగాయి. కొన్నిచోట్ల ప్రశాంతంగా, మరికొన్నిచోట్ల స్వల్ప వాగ్వాదాలతో జరగగా, కోరుకొండ హైస్కూల్లో కోరం లేక ఎన్నికల నిలిచిపోయింది. కోరుకొండ హైస్కూల్లో చైర్మన్ పదవి కోసం కూటమి నాయకుల మధ్య పోటీ జరిగింది. ఎన్నికల ప్రక్రియ నిర్వహించిన అనంతరం కోరం లేదని గ్రహించారు. దీంతో ఎన్నికలు నిలిచిపోయాయి.

గుమ్ములూరులో ఏకగ్రీవం

గుమ్ములూరు హైస్కూల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. గొల్లపల్లి అప్పారావు చైర్మన్‌గా, కొండపల్లి సుబ్బలక్ష్మి వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వీరితో పాటు 13 మంది సభ్యులను ఎంపిక చేశారు. వీరిని గ్రామ సర్పంచ్ నక్కా రాంబాబు, మాజీ సర్పంచ్ మట్టా పెదవెంకటేశ్వరరావు, చీంద్రిం చంటిబాబు, హెచ్ఎం గంగాభవాని అభినందించారు. బూరుగుపూడి ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా వేముదాసి ఏసురత్నం ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులనుగండి విజయ్‌కుమార్, కంటే గణపతి అభినందించారు. కాగా.. మండల విద్యాశాఖాధికారి కుశలవదొర విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. మండలంలోని 55 పాఠశాలలకు 43 పాఠశాలల్లో ఎన్నిక ఏకగ్రీవమైందని, 11 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయన్నారు.

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని హెచ్ఎం కన్నూరి సతీష్‌బాబు తెలిపారు. చైర్మన్‌గా పాట్నూరి భువనేశ్వరి, వైస్ చైర్మన్‌గా పీరిగాని పద్మ ఎన్నియ్యారన్నారు. పరిశీలకులుగా ఎంఈవో కె.స్వామి నాయక్ వ్యవహరించారన్నారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు.

రాజానగరం: మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. మల్లంపూడిలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఎన్నికలలో వైఎస్సార్ సీపీ మద్దతు పలికిన అభ్యర్థులే విజయం సాధించారు. మల్లంపూడిలోని రామాలయం వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా ఎరుబండి ఈశ్వరుడు, ఎస్సీపేట ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా ఈంద్రీ సుజాత గెలుపొందారని ఆ గ్రామ సర్పంచ్ ముప్పిరిశెట్టి నాగభద్రదొర తెలిపారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

పెదపూడి: మండలంలోని మొత్తం 57 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎన్నికల మండల కన్వీనర్, ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ తెలిపారు.

సంపర శివారు ముక్తేశ్వరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో ఆ పాఠశాలకు ఎన్నిక జరగలేదన్నారు. ఎన్నికల అబ్జర్వర్లుగా ఎంపీడీఓ ఆశాజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ ఎం.రామ్‌కుమార్ వ్యవహరించారు.

రంగంపేట: మండలంలోని మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మరో రెండు ప్రాథమిక పాఠశాలలకు విద్యా కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉన్నత పాఠశాలకు చైర్మన్‌గా పిల్లి అన్నవరం, వైస్ చైర్మన్‌గా వింజమళ్ళ దుర్గమ్మ ఎన్నికయ్యారు.

రూరల్ మండలంలో..

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని 52 ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన, సోషల్, బీసీ వెల్ఫేర్ ఉన్నత పాఠశాలలతో పాటు, ఒక ఎయిడెడ్ పాఠశాలలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. మెజార్టీ పాఠశాలల్లో కూటమి మద్దతుదారులే చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. రాజవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. పలు పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్ అభ్యర్థులు పసుపు చొక్కాలు ధరించి ఎన్నికలకు హాజరయ్యారు.